క్లుప్తంగా

గ్రామసభ



గ్రామసభలో సోషల్ ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీ రామకృష్ణ

రాజాం: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా మండలంలోని డీఆర్ఎన్ వలస గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సామాజిక తనిఖీలో వెల్లడైన విషయాలను వివరించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు రూ.61.97 లక్షలు వెచ్చించినట్లు సోషల్ ఆడిట్ డీఆర్‌పీ రామకృష్ణ తెలిపారు. వేతనదారులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం పాల్గొన్నారు.

శ్రీరామమందిరం పునర్నిర్మాణానికి శ్రీకారం



శ్రీరామమందిరం పునర్నిర్మాణానికి పూజలు చేస్తున్న శ్రీనివాసరావు

రాజాం: పట్టణంలోని టౌ హాస్పిటల్ రోడ్డులో శ్రీరామమందిరం పునర్నిర్మాణానికి గురువారం శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తొలుత సీతారాములకు పూజలు చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్. సూర్యప్రసాద్, సూర్యం, బీవీ శ్రీరాములు, కె.రాజా పాల్గొన్నారు.

చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలి



లింగాలవలస సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: గ్రామ సచివాలయ ఉద్యోగులంతా చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు కోరారు. గురువారం మండలంలోని లింగాలవలస, ఉంగరాడ, అంబఖండి గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయానికి విధులకు హాజరై, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.


సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ జాగారపు శ్రీనివాసరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని నారాయణప్పవలస ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని సర్పంచ్ జాగారపు శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పాఠశాల సిబ్బంది విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సరస్వతీదేవి ఆశీస్సులతో విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సూర్యారావు, పేరెంట్స్ కమిటీ సభ్యురాలు జి.ఎల్లమ్మ, హెచ్ఎం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



ఉమామహేశ్వరిని సత్కరిస్తున్న అధికారులు

రేగిడి: సారాబాయి టీచర్ సైంటిస్ట్ అవార్డు గ్రహీత బూరవిల్లి ఉమామహేశ్వరిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సత్కరించారు. రేగిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న ఆమె విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేసినందుకు గాను ఆ అవార్డు లభించింది. ఈ మేరకు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

విజయనగరం టౌన్: నిరుపేద మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు నవయువత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బి.స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు 45 రోజులు శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు ఈ నెల 31లోగా లక్ష్మంపదిరివారి వీధిలో ఉన్న తమ కార్యాలయానికి నేరుగా వచ్చి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి బ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 90009 43413 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళులు



రాజాం సిటీ: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు



బొబ్బిలి: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు



సంతకవిటి: జెడ్పీ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలోని చర్చి సెంటర్‌లో భగత్‌సింగ్ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, బ్రిటీష్ వారి కబంధ హస్తాల నుంచి భరతమాతను విడిపించేందుకు భగత్‌సింగ్ తన ప్రాణాలను పణంగా పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో పొట్నూరు శంకరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు, కోవిడ్–19 టీమ్ సభ్యులు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ కలిసి ఆయా మహానుభావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ప్రాణాలర్పించిన అమరులు త్యాగధనులని కొనియాడారు. వారి త్యాగాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకుని జీవించాలని కోరారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లూరు వెంకట నాగేశ్వరరావు, బీవీ అచ్యుత్‌కుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, దామోర రాజ, అప్పలరాజు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దాసరి కృష్ణారావు, సిబ్బంది కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

అనంతరం వారి త్యాగాలను కొనియాడారు. దేశాన్ని బ్రిటీష్ బానిస సంకెళ్ల నుంచి విడిపించేందుకు ఉరితాడును పూలమాలగా స్వీకరించి, త్యాగమూర్తులుగా గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గడే అప్పలనాయుడు, అదపాక దామోదరరావు, పల్లి గౌరునాయుడు, ఎం.శివరామకృష్ణ; వావిలపల్లి వెంకటరమణ, ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

రీ సర్వేపై ఆరా



సర్వేయర్,సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర భూ రీసర్వే ఆన్‌లైన్ ప్రక్రియపై ఆర్డీఓ పి.శైషశైలజ ఆరా తీశారు. ఈ మేరకు కార్యాలయాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు మండలంలోని 20 గ్రామాలలో తొలివిడతలో రీసర్వే జరగగా.. వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం నెమ్మదించడంపై సర్వేయర్ అప్పారావు, సర్వే సిబ్బందిపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజులలో ప్రగతి కనిపించాలని ఆదేశించారు. ఈ విషయమై ప్రతిరోజూ రివ్యూ చేసి తనకు నివేదిక అందించాలని రీసర్వే డీడీ జి.అప్పయ్య, తహసీల్దార్ ఎస్.రాజారావులకు సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్

రాజాం: మండలంలో బొద్దాం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శోభకృత్‌నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను తహసీల్దారు పి.విజయభాస్కర్ చేతులమీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ఈ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగిందని, ఇందులో తెలుగు పండగలు, తెలుగు నెలల విశిష్టత, భగవద్గీత శ్లోకాల సారాంశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామినాయుడు, మజ్జి రాజు, సత్యం, అప్పలరాజు, రామలింగం, పద్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్

- ఎస్ఈబీ ఏఎస్పీ అస్మా ఫర్హీన్

బొబ్బిలి: సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు మద్యం, మాదకద్రవ్యాలు, సారా రవాణాపై నిఘా పెట్టాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. గురువారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో సీఐ ఆర్. జైభీమ్ అధ్యక్షతన బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలన్నారు. మహిళా సమస్యలపైనా దృష్టి సారించి కౌన్సెలింగ్ చేపట్టాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలసాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేగిడి: ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలసాయం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ సీహెచ్ శారద తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఘన, ద్రవజీవామృతాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపాలని, అలా చేస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ, సర్పంచ్ కరణం గోవిందరావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి..

- మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ఈ నేపథ్యంలో అన్ని రంగాల్లోనూ అతివలు ముందుండాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో గురువారం స్థానిక జేఎన్‌టీయూ గురజాడ, విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో ‘ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్’ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశోధనా రంగంలో సైతం మహిళలు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. నూతనంగా ఏర్పడిన యూనివర్సిటీకి పేరు తెచ్చే విధంగా ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్‌తో పాటు విద్యార్థులు కృషి చేయాలన్నారు. రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు మాట్లాడుతూ, మగవారితో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రతి మహిళా ధైర్యసాహసాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం ముఖ్య అతిథి ఝాన్సీలక్ష్మిని సత్కరించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ జి.జయసుమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకుమార్, సెల్ డైరెక్టర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, సెక్రటరీ డాక్టర్ బి.నళిని, ట్రెజరర్ డాక్టర్ పి.అరుణకుమారి, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వీఎస్ వకుళ, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సీహెచ్.బిందుమాధురి, వివిధ విభాగాల మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలోని కంచరాం, పెనుబాక, గురవాం, దోసరి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం కలిసి గురువారం పరిశీలించారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే రోజుకు రూ.257 గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



ఎస్ఐ సూర్యకుమారిని సత్కరిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: మనం చేసిన సేవలే మనకు గుర్తింపునిస్తాయని సీఐ కె.రవికుమార్ అన్నారు. స్థానిక టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించి, భోగాపురం బదిలీ అయిన పి.సూర్యకుమారిని గురువారం ఘనంగా సత్కరించారు. కోవిడ్ సమయంలో ఆమె అందించిన సేవలను సిబ్బంది ప్రశంసించారు. సర్వీస్‌లో ఉన్నంత కాలం బాగా పనిచేసి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు

బాడంగి: మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ముహూర్తపు రాట వేసి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, దేవతామంటపం, తదితర పూజలు చేపట్టారు. అలాగే రెండో రోజైన గురువారం భగవద్గీత పారాయణం, హోమం, మంత్రస్థాపిత దేవతార్చన, సహస్ర నామార్చన, వేదస్వస్తి, భగవద్గీత ప్రవచనం నిర్వహించారు. వేడుకలు వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరుగుతాయని అర్చకుడు యడవల్లి శ్రీనివాసశర్మ తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార పక్షోత్సవాల్లో పాల్గొన్న సూపర్‌వైజర్, కార్యకర్తలు

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారావు అన్నారు. మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ కె. రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ మినుములతో తయారుచేసిన ఉత్పత్తులను తప్పకుండా తినాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయుడు తిరుపతిరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మి, సునీత, పార్వతి, కుమారి, విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో రైతులకు మేలు



విత్తనాలు కలుపుతున్న రైతులు, ప్రకృతి సేద్య ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: బహుళ పంటలతో రైతులకు మేలు కలుగుతుందని ప్రకృతిసేద్యం ప్రతినిధి యు.శంకరరావు సూచించారు. మండలంలోని జగన్నాథపురంలో పెట్టుబడి లేని ప్రకృతిసేద్యం, చిరుధాన్యాల పంటలపై సమ్మర్ డ్రై సోయింగ్‌లో భాగంగా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నువ్వు పంటలో మొక్కజొన్న, ఉలవలు, ఆవాలు, తోటకూర, గోంగూర, బొబ్బర్లు, గంటెలు కలిపి విత్తనాలు చల్లడం వల్ల అన్ని రకాల పంటలు పండుతాయన్నారు. దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశీల వేలం వాయిదా



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ కిస్తీకి సంబంధించి, ఆశీల వేలం వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయం వద్ద ఆశీల వేలం నిర్వహించారు. ప్రతీ ఏడాది గడిచిన ఏడాది కన్నా హెచ్చు మొత్తంలో వేలం ఖరారయ్యేది. దీనికి హాజరైన సభ్యులంతా ఒకేసారి అభ్యంతరం తెలపగా, కారణమేమిటని సభ్యులను కమిషనర్ అడగ్గా ఇటీవల ఇసుక లారీలకు సంబంధించి, ఆశీలు చెల్లించడంలేదన్నారు. నిత్యం పదుల సంఖ్యలో తిరుగుతున్న లారీలకు ఆశీలు చెల్లిస్తేనే మున్సిపాలిటీలో ఆశీల వేలంకు ముందుకురాగలమని సభ్యులు ముక్తకంఠంతో తెలిపారు. ముందస్తుగా లారీల డ్రైవర్లతో సమావేశమై, వారికి ఆశీల విషయం తెలియజేయాలన్నారు.

కమిషనర్ మాట్లాడుతూ పాటదారుల కోరిక మేరకు ప్రస్తుతం వేలం వాయిదా వేస్తున్నామని, తదుపరి తేదీని త్వరలో నిర్ణయించి, తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

27న వేలంపాట

రామభద్రపురం: అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో 2023–24 ఏడాదికి సంబంధించి రోజువారం ఆశీలు వసూలుకు డివిజనల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ఈ నెల 27న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ సుప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచిన వారు రోజువారీ ఆశీలు వసూలుకు రూ. 2 లక్షల ధరావతు, తహసీల్దార్ వారిచే ధ్రువీకరించిన రూ.8 లక్షల విలువ చేసే సాల్వెన్సీ సమర్పించాలన్నారు. పంచాయతీ పరిధిలోని కోనేటిగట్టులపై ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయం పొందేందుకు రూ. 5 వేల ధరావతు, రూ.50 వేలు విలువ చేసే సాల్వెన్సీ సమర్పించాలని పేర్కొన్నారు. అయితే సాగులో ఉన్న జిరాయితీ పట్టా భూములు, తోటలపై సబ్ రిజిస్ట్రార్ వారి రేటు ప్రకారం తహసీల్దార్ వారిచే ధ్రువీకరించబడిన మోతుబరి ధ్రువపత్రం మాత్రమే చెల్లుబాటవుతుందన్నారు. ఇళ్లపై ఇచ్చిన సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రాలు చెల్లుబాటు కావని సూచించారు. అలాగే పారిశుధ్య పనులు చేయడానికి 15 మంది, మంచినీటి సరఫరా, లైటింగ్ పనులు చేయుటకు ఇద్దరేసి చొప్పున.. ట్రాక్టర్లు, డీజిల్ ఆటోలు నడపడానికి లైసెన్స్‌లు కలిగిన నలుగురు వ్యక్తులను సప్లై చేయడానికి రూ.5 వేల ధరావతుచెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. చదువురాని మహిళలు చిట్టిగురువుల ద్వారా చదువు నేర్చుకోవాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, ఏపీఓ టి.మంగమ్మ సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ లావాదేవీలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని, ఒక్కోసారి సైబర్ మోసాల బారినపడి నగదు కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరన్నారు.

ఆధునిక సాగు..ప్రోత్సాహం బాగు..

- రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు



నాయుడువలసలో పవర్ వీడర్‌తో టమాట పంటలో తారెలు తీస్తున్న రైతు



ఆరికతోటలో మినీరైస్ మిల్లుతో ధాన్యం ఆడుతున్న చంద్రరావు



కొండకెంగువలో కట్టర్‌తో పొలంలోని గడ్డి కోస్తున్న రైతు

రామభద్రపురం: రైతులకు అన్ని విధాలా సాయం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతులను సంఘటితం చేసి వారికి అవసరమైన పరికరాలను వారే ఎంచుకునే విధంగా చైతన్యపరుస్తోంది. ఎంపిక చేసుకున్న పరికరాలను కూడా సబ్సిడీపై అందిస్తోంది. దీంతో కూలీల కొరత తగ్గి అన్నదాతలు సకాలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన సీహెచ్‌సీ గ్రూపుల ద్వారానే కాకుండా వ్యక్తిగతంగా కూడా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందజేస్తున్నారు. 2022 – 23 ఏడాదిలో 510 ఆర్బీకేలలో 317 రైతు గ్రూపులను గ్రౌండింగ్ చేయగా వీరికి రూ.26.27 కోట్లతో వ్యవసాయం పరికరాలు, యంత్రాలు అందజేయగా.. ఇందులో రూ. 5.65 కోట్ల రాయితీ కల్పించారు. యంత్రాలపై 40 నుంచి 50 శాతం వరకు సబ్సిడీ వర్తిస్తోందని రైతులు చెబుతున్నారు. యంత్రాల వినియోగం వల్ల మెట్టు ప్రాంత రైతులు, అంతర పంటలు సాగు చేసే వారు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు. గతంలో పొలాలను దున్నడానికి ట్రాక్టర్లు, వరి నాట్లు, కోతలు, నూర్పిడిలకు రైతులు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి యంత్రాలను సమకూర్చుకునేవారు. ప్రస్తుత ప్రభుత్వం రాయితీపై యంత్రాలు అందజేస్తుండడంతో ఎక్కువ మంది ఆధునిక పనిముట్లతో సాగు చేపడుతున్నారు. మండలంలోని రామభద్రపురం, నాయుడువలస, కొండకెంగువ, రొంపల్లి రైతులు మినీ యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. స్వదేశీ, విదేశీ టెక్నాలజీతో తయారైన రోటావీటర్లు, పవర్ వీడర్లు, ఇంజన్లు, కట్టర్లు, సూపర్ టిల్లర్లు ఉపయోగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరికతోటకు చెందిన బి. చంద్రరావు అనే రైతు మహారాష్ట్ర నుంచి మినీ రైస్‌మిల్లు యంత్రం కొనుగోలు చేసి ఇంటింటికీ వెళ్లి ధాన్యం ఆడుతున్నారు. ఇలాగే మరింతమంది రైతులు ఆధునిక పనిముట్లు వినియోగిస్తున్నారు.